ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడగింపు

కామారెడ్డి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫ్రెష్, రెన్యూవల్ ఉపకార వేతనాల దరఖాస్తు గడువు ఈనెల వచ్చే నెల 30 వరకు పెంచబడిందని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత తెలిపారు. ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునే వారు తెలంగాణ ఈపాస్. సీజీజీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు మార్క్ అవుట్ చేసిన దృశ్యం

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇష్టారాజ్యం
- దరఖాస్తులు, సర్వేలు అన్నింటికీ తూట్లు
- నిబంధనలకు విరుద్ధంగా జాబితా ఉందంటూ ఆరోపణలు
- నేతల అనుచరులకే ప్రాధాన్యం
- నెరవేరని పేదల సొంతింటి కల
- రెండో విడతలో 9,064 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం
- ఇప్పటికే మొదటి విడతలో 1,808 ఇళ్ల మంజూరు

పైరవీలకే పెద్దపీట

కామారెడ్డి, మే 30(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక పూర్తిగా రాజకీయ కోణంలో జరిగినట్లు పైరవీలకే పెద్దపీట వేసినట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేకు భిన్నంగా అర్హుల జాబితా రూపొందించినట్లు ఆరోపణలు లేకపోలేదు. మొదటి విడత పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కొంత వరకు అర్హులకే ఇళ్లు దక్కినప్పటికీ రెండో విడత జాబితా తయారీ పూర్తిగా స్థానిక ఎమ్మెల్యే వారి అనుచరుల కనుసన్నల్లోనే పూర్తయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇందిరమ్మ కమిటీల సిఫారస్ చేసిన కార్యకర్తలు, ఓటర్లకే ఇళ్లను కట్టబెట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. అర్హులకు బదులు అనర్హులు వచ్చి చేరినట్లు సమాచారం. విషయం అధికారులకు తెలిసి ఏమి చేయలేక వారు సూచించిన పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పేదల సొంతింటి కల నెరవేరకుండా పోతోంది.

రాజకీయ జోక్యంతో..

ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షల్లోనే దరఖాస్తులు వచ్చాయి. కుల గణన, ఇంటింటి



సర్వేలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, జియో ట్యాగింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఎంపిక చేసిన బృందాలు దరఖాస్తు దారుని ఇంటికి చేరుకుని వివరాలు సేకరించారు. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించేలా జాబితా రూపొందించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను మొదట ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌ల లాగి న్‌లో ఉంచారు. గ్రామసభలు, వార్డుసభల్లో ఆయా లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. తీరా తుది జాబితా రూపకల్పనలో రాజకీయ పైరవీలకే పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. పారదర్శకంగా నిజా యితీగా పేదలకు దక్కాల్సిన ఇళ్ల రాజకీయ జోక్యంతో పార్టీ నాయకులు తన్నుకుపోతున్నారని పేదలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేలు చెప్పిన వారి పేర్లను మాత్రమే జాబితాలో చేర్చుతుండడం, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు వాటిని ధ్రువీకరిస్తుండడం, ఉన్నతాధికారులు సైతం ఆమోద ముద్ర వేస్తుండడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

వివిధ దశల్లో 1,808 ఇళ్ల నిర్మాణాలు

గత జనవరిలో జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా 2,396 మంది లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. వాటిలో 1,808 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఈ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 487 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఇందులో 385 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా 102 ఇళ్ల నిర్మాణాలు బేస్మిట్ స్థాయిలో ఉన్నాయి. అయితే గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామసభల్లో ఇళ్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 2,45,541 ఇళ్ల కోసమై దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణశాఖకు నిర్మాణాల బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో నియోజకవర్గానికి 3500ల ఇళ్ల చొప్పున ప్రభుత్వం మొదటి విడత కింద మంజూరు చేసింది. రూ.5లక్షలు ఇళ్ల నిర్మాణం కోసం విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేయనుంది.

రెండో విడతలో 9,064 ఇళ్ల మంజూరు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. రెండో విడతలో 9,064 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కామారెడ్డి నియోజకవర్గంలో 3,028, ఎల్లారెడ్డిలో 3,363, జుక్కల్‌లో 2,673 ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాద నలు సిద్ధం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలోనూ ఇళ్ల ప్రతిపాదనల కోసం సర్వే కొనసాగుతోంది. ప్రతిపాదించిన ఇళ్ల నిర్మాణాలకు ఇన్‌చార్జ్ మంత్రి నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 200ల ఇళ్లకు జిల్లా కలెక్టర్ మంజూరు చేసినట్లు తెలిసింది. త్వరలోనే రెండో విడత ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు నిర్మాణ పనులు సైతం ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

అందని ఆర్థిక సాయం.. పెరిగిన ధరలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరై సొంత ఖర్చులతో బేస్మిట్ వరకు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆర్థిక సహకారం అందకపోవడంతో వారు అయోమయంలో పడుతున్నారు. ఇప్పటికే చేతిలో ఉన్న సొమ్ము పూర్తిగా ఖర్చు కాగా మార్కెట్‌లో అప్పులు పుట్టని పరిస్థితి ఎదురవుతోంది.

(మిగతా 6వ పేజీలో)



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

భూ భారతిపై అవగాహన చేపడతాం

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్ట్ కింద భూ భారతి కార్యక్రమాన్ని నిర్వహించిన అనుభవాలను జిల్లాలోని మిగితా మండలాల్లోని రెవెన్యూ సిబ్బందికి వివరించడానికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ నవీన్‌మిట్టల్ పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూ భారతి కార్యక్రమంపై నాలుగు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని లింగంపేట మండలంలో భూ భారతి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనపై కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో 4225 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ వివరించారు. ఆమోదం తెలిపిన వాటిలో విజయగాథలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

లింగంపేట: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగంగా నిర్మించుకుంటే దశల వారీగా వెంట వెంటనే రూ. 5లక్షలు అందజేస్తామని ఆయన తెలియజేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుకను ఫ్రీగా అందజేస్తామని లేబర్ చార్జీలు, రవాణ చార్జీలు లబ్ధిదారులు బరించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న సానిటరి పనులను ఆయన పరిశీలించారు. మురికి కాలువలను వర్షాకాలం ప్రారంభానికి ముందే శుభ్రం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీవో సురెందర్, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు అధికారి విజయ్‌పాల్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఎంపీడీవో నరేష్, పంచాయతీ అధికారి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

చెరువు కట్టలు భద్రమేనా?

- మిషన్ కాకతీయ తర్వాత మరమ్మతులకు నోచుకోని చెరువు కట్టలు
- భారీ వరదలకు గండ్లు పడుతున్న వైనం
- చెరువులపై ఇరిగేషన్ శాఖ దృష్టి సారించాలంటున్న గ్రామస్థులు



5

రబీలో 50 ఎకరాల్లో వరి విత్తన సాగు

- మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో అకాల వర్షాలకు తడిసి, మొలకలొచ్చి ముక్కిపోయిన వరి సీడ్ ధాన్యం
- ధాన్యం కల్లాలకు చేరుకున్నప్పటి నుంచి ఎడతెరపి లేని వర్షం



5

బాన్సువాడ బస్టాండ్‌లో సమస్యల తిష్ట

- పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు
- పరిసరాల్లో చెత్త, చెదారం
- కానరాని అధికారుల చర్యలు



5



రోడ్డు పక్కన మొరం వేస్తున్న దృశ్యం

రోడ్డు పక్కన మొరం వేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దోమకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): దోమకొండ నుంచి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి, బిక్కనూర్ వరకు నూతనంగా రోడ్డు నిర్మించారు. అయితే రోడ్డు పక్కన మొరం వేయకపోవడంతో భారీ వాహనాలు వచ్చిన సమయంలో ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. దీంతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 11న 'రోడ్డు వేశారు.. మొరం మరిచారు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన సంబంధిత శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో శుక్రవారం రోడ్డు పక్కన మొరం వేయించారు. దీంతో గొట్టిముక్కుల, దోమకొండ, లక్ష్మీదేవునిపల్లి, బిక్కనూర్ గ్రామాలతో పాటు అటుగా ప్రయాణాలు కొనసాగించే వాహనదారులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



కందకాలు తవ్వుతున్న అధికారులు

అటవీ భూములను ఆక్రమించినా..
చెట్లు నరికినా చర్యలు తప్పవు : ఎఫ్ఆర్‌వో

రాజంపేట, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామపరిధిలో శుక్రవారం అటవీ ప్రాంతంలో అక్రమంగా ఆక్రమించిన భూముల్లో పోలీసుల సహకారంతో అటవీ అధికారులు కందకాలు తవ్వారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ రమేష్ మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా ఫారెస్ట్ భూములను ఆక్రమించిన వారి నుంచి 15 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అటవీ భూముల్లో చెట్లు నరకడం భూమిని ఆక్రమించడం అటవీ చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైన అటవీ భూములను దున్నినా, చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవీ రామకృష్ణ, భిక్కనూర్ సీఐ సంపత్‌కుమార్, రాజంపేట ఎస్ఐ పుష్పరాజ్, సెక్షన్ అధికారి (మిగతా 6వ పేజీలో)

కల్వరాల్ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి



కంప్యూటర్ శిక్షణను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ ఉషారాణి

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకురాలు ఉషారాణి

సదాశివనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి నిదర్శనం సదాశివనగర్ మండలం కల్వరాల్ ఉన్నత పాఠశాలేనని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకురాలు ఉషారాణి అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్వరాల్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, యువకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విలువలతో కూడిన విద్యా బోధన జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వసతులను తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజల భాగస్వామ్యం చాలా (మిగతా 6వ పేజీలో)



నియామక పత్రం అందుకుంటున్న ఆలయ కార్యవర్గ సభ్యులు

ఆలయాల అభివృద్ధికి తోడ్పడాలి

● ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): దేవుని ముందు అందరూ సమానులేనని.. నిస్వార్థంగా ఆలయాల అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వైద్య కిషన్‌రావు, డైరెక్టర్లుగా భీమ్‌రాజ్, దాసోజ్ శ్రీనివాస్, గంగామణి, శంకరయ్యలను నియమించామన్నారు. కాంగ్రెస్ హయాంలో దేవాలయాల పునరుద్ధరణ బాగా జరిగిందని తెలిపారు. మన పాపాలు పోగొట్టి పుణ్యాలు కలిగించేవాడు దేవుడని అందుకే దేవుడు అందరివాడని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని పలు గ్రామాలలోని ప్రజలకు రూ.18లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. అనారోగ్యంతో అప్పులపాలైన (మిగతా 6వ పేజీలో)

పెద్దమల్లారెడ్డిలో జీలుగ విత్తనాల పంపిణీ

భిక్కనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో కార్యాలయంలో చైర్మన్ రాజాగౌడ్ శుక్రవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ మాట్లాడుతూ పెద్దమల్లారెడ్డి విండోకు 166 జీలుగ బస్తాలు వచ్చాయన్నారు. విండో కార్యాయలంలో అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగ విత్తనాలకు పట్టాపాస్‌బుక్కు, ఆధార్‌కార్డులో జిరాక్స్‌లతో ఏఈవో కార్యాలయంలో పర్మిట్ తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో మోహన్‌గౌడ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్ణాటక టు జుక్కల్ నకిలీ సోయా విత్తనాల సరఫరా

- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- జుక్కల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల డంపు
- వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాలు బేఖాతర్

జుక్కల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జుక్కల్ మండలానికి సమీప దూరంలో కర్ణాటక మహా రాష్ట్ర సరిహద్దులు ఉన్నాయి. జుక్కల్‌లో సోయా నకిలీ విత్తనాల విక్రయాలకు వ్యాపారులు తెర లేపారు. కర్ణాటక టు జుక్కల్ మండలానికి ఆటోల ద్వారా విత్తన వ్యాపారులు సోయా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయించడానికి గ్రామీణ ప్రాంతాలలో డంపు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ రాష్ట్రంలో నకిలీ విత్తనాలను నివారించి రైతులకు విత్తనాలు వ్యాపారులు విక్రయించాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాలను వ్యవసాయ శాఖ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. విధి నిర్వహణలో విత్తనాలపై నిఘా పెట్టకుండా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులను గుర్తించి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అధికారుల సమీక్ష సమావేశంలో మంత్రి ఆదేశాలు జారీ చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. కఠిన నిబంధనలు ఉన్నా అధికారుల నిఘా లేకపోవడంతో సందెట్లో సడేమియ అన్నట్లు వ్యాపారులు నకిలీ విత్తనాలను విక్రయించి వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. లక్షల్లో లాభాలు సంపాదించుకోవాలని వ్యాపారస్తులు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. జుక్కల్ మండలంపై ఉన్నత అధికారుల నిఘా లేకపోవడంతో వ్యాపారస్తులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యత గల సోయా విత్తనాలు దా పతర్ సీడ్ 30 కేజీల బ్యాగు 3,200 ధర ఉంది. నకిలీ సోయ విత్తనాల బ్యాగు 2000 రూపాయలకు తక్కువ ధర ఉండడంతో అమాయక రైతులు కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. తక్కువ ధరకు రావడంతో రైతులు నకిలీ విత్తనాలపై ప్రశ్నించ లేక వ్యాపారి ఇచ్చిందే బ్యాగు తీసుకొని రసీదులు లేకుండా రైతులు ఇంటికి తీసుకెళ్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఒక వ్యాపారి దొంగ చాటుగా ఆటోల ద్వారా నకిలీ విత్తనాలు గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. నకిలీ విత్తనాలు విత్తడంతో భూమిలో భూసారం దెబ్బతిని రాబోవు కాలంలో పంటల దిగుబడులు రాలేక రైతులు నష్టపోతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నకిలీ విత్తనాల సరఫరా



ఆటోలో సరఫరా చేస్తున్న నకిలీ విత్తనాలు

నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అందులో రెవెన్యూ పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులు ప్రతీ దుకాణాన్ని తనిఖీ చేసి విత్తనాలు నాణ్యత పరిశీలించి మొలక శాతం చూడాలని నిబంధన ఉంది. ఇట్టి నిబంధనలు అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారస్తులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి విత్తనాల డంపులను గుర్తించి కేసు నమోదు చేయాలని జుక్కల్ ప్రజలు డిమాండ్ చేశారు.

నా పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): తన పేరు చెప్పి అధికారుల పై దురుసుగా ప్రవర్తించినా, డబ్బులు వసూలు చేసినా సహించేది లేదని ఎవరైనా సరే పార్టీ నుంచి సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రజలకు నేరుగా చేరుతాయని, ఎవరు కూడా మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, నాయకులు మారుతిరెడ్డి, పోతు నర్సయ్య, శేఖర్‌రెడ్డి, కొంతం మురళి, నీరజ్, శ్యాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

డొంకేశ్వర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వభూమిని ఆక్రమించి భవన నిర్మాణాన్ని చేపడుతున్నారని డొంకేశ్వర్ గ్రామస్థులు శుక్రవారం ఎంపీడీవో లక్ష్మీప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రధానరోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపడుతు న్నా రని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకాకుండా అధికారు లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు ప్రజు తదితరులు పాల్గొన్నారు.

అన్నారం గ్రామంలో శాఖాహార ర్యాలీ

డొంకేశ్వర్, మే 30 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల సంరక్షణ కోసం అహింసాయుత మహాకరణ శాఖాహార ర్యాలీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి తెలిపారు. డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధాన్య, జ్ఞాన, శాకాహార ర్యాలీ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అతిథులుగా హిమాలయ యోగి, స్థితనందా సరస్వతి, కేదారేశ్వర ఆశ్రమ వ్యవ స్థాపకులు మంగి రాములు మహారాజ్ హాజరవుతున్నామన్నారు.

పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా అనిల్ నియామకంపై హర్షం

మెండోర, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పొలి టికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడిగా నియామకంపై వేల్పూర్ మార్కె ట్‌కమిటీ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈరవత్రి అనిల్ నియామకా నికి కృషిచేసిన సోనియాగాంధీ, మల్లికార్జునఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్‌లకు మండల కాంగ్రెస్ నాయ కులు కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బోధన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఉద్మీర్ గల్లీకి చెందిన తాహెర్ అనే వ్యక్తిని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పకడ్బందీ సమాచారం మేరకు దాడులు నిర్వహించి అతనిని పట్టుకోగా అతని వద్ద 130గ్రాముల ఎండు గంజాయి లభించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయించిన, గంజాయి తాగిన, సరఫరా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొర్లికొండలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, మే30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలో శుక్రవారం 15 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆర్మూర్ మార్కెట్ కమి టీ డైరెక్టర్ కనకరవి, బ్రాహ్మన్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. తొర్లికొండ గ్రామానికి చెం దిన 15 మంది లబ్ధిదారులకు కలిపి 3 లక్షల 40వేల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడ కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిరెడ్డి, రాకేష్, వినోద్, కౌలాస్, సంతోష్‌యాదవ్, రణవీర్, గ్రామశాఖ అధ్యక్షుడు తాజొద్దీన్ పాల్గొన్నారు.

ఒకే దఫా మూడునెలల బియ్యం ఇవ్వాలి

వర్ని, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడునెలల సన్న బియ్యం ఒకే విడతలో ఇవ్వాలని వర్ని తహసీల్దార్ సాయిలు ఆదేశించారు. శుక్రవారం రేషన్‌డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఉప తహసీల్దార్ మమత, ఆర్ఐలు శ్యాంకుమార్, అనురాధ, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అతిమల నగేష్, ఆజయకుమారి పాల్గొన్నారు.

కాలువ నిర్మాణానికి సర్వే



భీమ్‌గల్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

భీమ్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని మొగిలి చెరువు నుంచి రాతం చెరువు వరకు కాలువ నిర్మాణం కోసం రెవె న్యూ, ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి సర్వే చేపట్టారు. వర్షాకాలంలో అయ్యప్పనగర్, విద్యానగర్ కాలనీలో డ్రైనేజీలు లేక నీరు నిల్వ ఉండడం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించి కాలువ నిర్మాణానికి ప్రతిపాదించారు. సర్వేలో ఇరిగేషన్ ఈఈ భానుప్రకాష్, తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, ఇరిగేషన్ డీఈ నాగేశ్వర్, ఎస్సై మహేష్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొరిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మల్లెల లక్ష్మణ్, రమేష్ తదితరులున్నారు.

డీసీ తండాలో టవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

కమ్మర్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌టెలికాం రంగం సంస్థలకు దీటుగా బీఎస్ఎన్ఎల్ సంస్థ తమ సేవలను మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించాలన్న ఉద్దేశంలో అవసరమున్న ప్రాతాలలో టవర్ల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నది. ఇందులో భాగంగానే కమ్మర్‌పల్లి మండలం దోమ్మరిసాడు (డీసీ) తండా గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు టవర్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కమ్మర్‌పల్లి తహసీల్దార్ సి.ప్రసాద్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ శరత్, గ్రామ మాజీ సర్పంచ్ భాస్కర్, గ్రామ గిరిజనులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

బోధన్‌రూరల్,మే30(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మావంది కలాన్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పోతారెడ్డి, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోస్రా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా శుక్రవారం చందూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి సొంత స్థలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ఇళ్లకు ముగ్గులు వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ లహరి, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు ప్యారం అశోక్, మాజీ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అంబర్ సింగ్, మాజీ ఎంపీపీ లావణ్య రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని జక్రాన్‌పల్లిలో శుక్రవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. అదేవిదంగా అర్గుల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. జక్రాన్‌పల్లిలో 50 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు కాటిపల్లి నర్సారెడ్డి, సొప్పరి వినోద్, వసంత్‌రావు, లావణ్య, నవీనా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు అక్బర్, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవీపేట : మండలంలోని జన్నేపల్లిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చామంతి రాజు, భట్టు లక్ష్మణ్ రావు, సురేష్, నారాయణ రావు, సాయిలు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం జీపీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు మార్కౌట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాలమోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్‌లు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తమ గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకు కృషి చేస్తామ న్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవనీత, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, గట్టువతల నర్సారెడ్డి, నెహ్రూ, లింగేశ్వర్ పాల్గొన్నారు.

ఆలూర్ : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి శుక్రవారం మార్కింగ్, భూమిపూజ పనులను ఎంపీడీవో గంగాధర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేద వారికి సొంత ఇంటికలను సాకారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఇందిరమ్మ ఇళ్ల కమిటి సభ్యుడు ఆమందు సంజీవ్, భాస్కర్, చిరంజీవి, నారాయణ, నాయకులు గంగారెడ్డి, నవనీత్, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

నందిపేట : మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, ఆర్మూర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ భూమి పూజచేశారు. ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు మేతరి వసంత అనే లబ్ధిదారుల ఇంటికి ముగ్గుపోశారు. కార్యక్రమంలో మండల సొసైటీ డైరెక్టర్ తోట మహేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, పంచాయతీ కార్యదర్శి కండెల నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుక్కన్న ఉన్నారు.

ఎడపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతికి లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట నాయకులు వినోద్, రంజిత్, మహమ్మద్ జిలానీ తదితరులు ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

రెంజల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పండుగలను కుల,మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని సాటాపూర్ రైతువేదికలో శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా గోవుల రవాణా జరగకుండా చూడాలన్నారు. ఆవులు, దూడలను అమ్మవద్దని, రవాణా చేయరాదని, పశువైద్య అధికారి సమక్షంలో ధృవీకరణ పత్రం తీసుకుని గ్రామ పంచాయతీ రసీదు తీసుకోవాలన్నారు. వాహనంలో అధిక మొత్తంలో రవాణా చేయకూడదని సూచించారు. సాటాపూర్ పశువుల సంతలో కొనుగోలు నిర్వహించే వారికి పలు సూచనలు చేశారు. పండుగ సందర్భంగా ఆవు, దూడల అమ్మకాలు చేయకూడదని, ఇతర పశువులను అమ్మేందుకు డాక్టర్‌తో పాటు గ్రామ పంచాయతీ ధృవీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరు కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ విజయ్ బాబు, పశువైద్య అధికారి విఠల్, ఎస్ఐ చంద్ర మోహన్, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

'గోవధ జరగకుండా చర్యలు చేపట్టండి'

బోధన్‌రూరల్ : గోవధ జరగకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు శుక్రవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గో సేవాస మితి అధ్యక్షులు సంతోష్ గుప్తా, గోశాల అధ్యక్షులు నేపాల్‌సింగ్ మాట్లాడుతూ బక్రీద్ నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బోధన్ ఎంవీఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. వాహనాల్లో సాటాపూర్ తదితర వారాంతపు సంతల నుంచి గోవులను కొందరు అక్రమంగా తరలిస్తున్నారని అటువంటి వారిని పట్టుకుని వాహనాలను సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపి కిషన్, జనరల్ సెక్రెటరీ రాజులదేవి పవన్‌కుమార్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌వినయ్‌కుమార్

రెంజల్,మే30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెంజల్, వీరన్నగుట్ట గ్రామాలలో ఆకస్మికంగా సందర్శించి గ్రామాలలో ఫీవర్‌సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు ఏ మేరకు చేపడుతున్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుందని, అందువల్ల ఇంటి పరిసరాలలో ప్రతిఒక్కరూ దోమలు, లార్వా వృద్ధి ప్రదేశాలను సకాలంలో గుర్తించి నివారణ చర్యలను చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, హెల్త్ అసిస్టెంట్ విజయ, వసంత పాల్గొన్నారు.

పడిగెలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

వేల్పూర్ , మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడిగెల గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వవిద్యార్థులు శుక్రవారం సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మిత్రయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 25 సంవత్సరాల తర్వాత తామందరం ఒకచోట కలువడం సంతోషంగా ఉందని పూర్వవిద్యార్థులు తెలిపారు. అంతకు ముందు పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం 25 సంవత్సరాల క్రితం చదువుకున్న తరగతి గదులను సందర్శించి వారి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అప్పటి పూర్వ ఉపాధ్యాయులు అనసూయ, నర్సింహులు, వెంకట నర్సయ్య, నారాయణ, రాజేశ్వర్, రవికుమార్, పోశన్నలను శాలువతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. తమకు విద్యబుద్దులు నేర్పిన గురువులను సన్మానించడం ఆనందంగా ఉందని, సహకరించిన మిత్రయూత్ సభ్యులకు పూర్వ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు

కోటగిరి,మే30(ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో అధికదిగుబడులు సాధించడంతో సహా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేందుకు వరి, చెరకు పంటలలో కొత్త వంగడాలను విడుదల చేసినట్లు రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి అంజయ్య తెలిపారు. రుద్రూరు మండల కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేవీకే అధిపతి అంజయ్య మాట్లాడుతూ 2024- 20205 ఆర్‌డీఆర్1162 అనే స్వల్ప కాలిక రకం విడుదల చేశామన్నారు. ఈ రకం రెండు కాలాలకు అనువైనదని ఆయన వివరించారు. వానాకాలంలో 120రోజులు, యాసంగిలో 135రోజుల పంట కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ రకాన్ని జేజీఎల్11727, జేజీఎల్ 17004 అను రకాలను సంకరపర్చి రూపొందించామన్నారు. యువ శాస్త్రవేత్తలు కొత్త రకం వంగడాలను తయారు చేయడంపై అభినందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాకేష్, రమ్య రాథోడ్, సౌందర్య పాల్గొన్నారు.



పరిశోధన కేంద్రంలో మాట్లాడుతున్న కేవీకే అధిపతి అంజయ్య

రెంజల్: రైతులు కాలానికి అనుగుణంగా పంటలు పండించుకోవాలని, ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి వల్ల రైతులు సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాకేష్, పద్మావతిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. యూరియా, ఇతర ఎరువుల వాడకం, తెగుళ్ళ, పురుగు మందుల వాడకం, విత్తన శుద్ధి మొదలగు అంశాల గురించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, పశువైద్య అధికారి విఠల్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

●బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వసంత్ రెడ్డి

బోధన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు తప్పకుండా నడుచుకుంటూ రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నడిపి వసంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా నడిపి వసంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ఆదినారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ వసంత్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన వసంత్ రెడ్డికి ఈ పదవి దక్కడం అభినందనీయమన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, సాలూర అధ్యక్షులు మందర్నా రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, శివాలయం చైర్మన్ హరికాంత్ చారి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న టీజీఈడబ్ల్యూ ఐడీసీఎండీ గణపతిరెడ్డి

కోటగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామశివారులోని పీఎస్ఆర్‌నగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శుక్రవారం టీజీఈడబ్ల్యూ ఐడీసీఎండీ గణపతిరెడ్డి పరిశీలించారు. పీఎస్ఆర్ నగర్‌లో సుమారు 15 ఎకరాలకు పైగా స్థలం అందుబాటులో ఉండడంతో పాటు అనువైనదిగా ఉందన్నారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్‌లో స్థల పరిశీలన పూర్తయిందని, పీఎస్ఆర్ నగర్‌లో స్థలం అనువైనదిగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ షఫీ మియా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ గౌడ్, డీఈ సుబ్బారాయుడు, రవి కుమార్, తహసీల్దార్ గంగాధర్, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, ఏజాజ్ ఖాన్, శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

'టీయూసీఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి'

కోటగిరి, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జూన్ 1వ తేదీన తలపెట్టిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభను కార్మిక ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. రుద్రూరు మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి శుక్రవారం జిల్లా మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ముత్తన్న, లత, లలిత, మౌనిక, జ్యోతి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో కలుషిత నీరు తాగి మేకల మృత్యువాత

ఏర్గట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం కలుషిత నీరు తాగి ఆరుమేకలు మృత్యువాతపడ్డాయని బాధితుడు తెలిపారు. గ్రామానికి చెందిన మెరుగు గంగయ్యకు చెందిన మేకలను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లగా కలుషిత నీరు తాగి మృత్యువాత పడ్డాయన్నాడు. వాటి విలువ సుమారు 70 వేల ఉంటుందని, ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

జక్రాన్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధయక్షుడిగా నవీన్, చిరంజీవి, బాల్‌రెడ్డి, రాజకళ, ప్రధానకార్యదర్శులుగా లత, కుంట శ్రీనివాస్, కార్యదర్శులుగా తిరుపతి రెడ్డి, బనవత్ లక్ష్మీణ్, సాయిలు, కమల, మమత, కోశాధికారిగా కుంట భూషణ్‌ను నియమించారు. 20 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ తెలిపారు.

'నిబంధనల మేరకు విత్తనాలు అమ్మాలి'



విత్తన డీలర్ల షాపును తనిఖీ చేస్తున్న ఎస్సై, అధికారులు

మోర్తాడ్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విత్తన డీలర్ల షాపులను శుక్రవారం ఎస్సై విక్రం, వ్యవసాయశాఖ అధికారి హరీష్ కుమార్‌లు తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని పలు వ్యవసాయ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు దుకాణాలలోని రిజిష్టర్‌లను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనల మేరకు విత్తనాలు అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో హరీష్‌రావు, ఎస్సై విక్రం, పోలీసులు ఏఈవోలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : వానాకాలం పంటలు వేసుకునే రైతులు తమకు కావాల్సిన విత్తనాలు క్రిమిసంహారక మందులు ఇతరత్ర ఎరువులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి కొనుగోలు చేయాలని కమ్మర్‌పల్లి ఎస్.ఐ. అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని విత్తనాలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలను పరిశీలించారు.

పిప్రిలో బడిబాట కార్యక్రమం

ఆర్మూర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మధ్యాహ్న భోజనం అందజేస్తూ ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నామ న్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు ప్రైయివేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ శ్రీనివాస్, కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం విశ్వనాథ్, భూషన్ తదిత రులు పాల్గొన్నారు. పెర్కిట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక నాయకులు, యువకులు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయుడు మద్దికుంట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం

కమ్మర్‌పల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం గా రాష్ట్ర ప్రభుత్వం ఇందూరు అక్షర లక్ష్మీ పథకాన్ని ఏర్పాటు చేసిందని, నిరక్షరాస్యులు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి ఎస్.ఆంధ్రయ్య, మండల ఐకేపీ ఏపీఎంకుంట గంగారెడ్డి సూచించారు. శుక్రవారం మండల ఐకేపీ కార్యాలయంలో నిర్వహించి న మండల మహిళాసమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక నిరక్షరాస్యులను అక్షరాస్యత వైపు మళ్లించడానికి , మధ్యలో చదువు మానివేసిన వారు తిరిగి కొనసాగించుకోవడానికి వీలుగా దూరవిద్యావిధానం అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మామిడి కమల, కార్యదర్శి వాసవి, కోశాధికారి రోజారాణి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగహంసా, ఐకేపీ సిబ్బంది బాలేరావు రవి కుమార్, వర్గం శ్రీనివాస్, భాగ్యలక్ష్మీ, పార్వ, ధనలక్ష్మీ, అలేఖ్య, వర్డ్ స్వచ్ఛందసంస్థ ప్రతినిధి సరిత, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మండల మహిళా సమాఖ్య సమావేశం

నవీపేట,మే30(ఆంధ్రజ్యోతి): మండల మహిళ సమాఖ్య సమావేశం శనివారం మండల ఐకేపీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఏపీఎం భూమేష్ గౌడ్ తెలిపారు. మండలంలోని 55గ్రామ సంఘాల అధ్యక్షులు ఉదయం 11:30గంటలకు కార్యాలయంలో జరిగే మహసభకు హజరుకావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల మహిళ పదాధికారుల కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని వివరించారు.

'మందకృష్ణ స్వాగత సభను విజయవంతం చేయండి'

బోధన్‌రూరల్,మే 30(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ స్వాగత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు లింబూరి లక్ష్మణ్ కోరారు. శుక్రవారం ఆయన సాలూర మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డును స్వీకరించి ఆదివారం వరంగల్‌కు వస్తున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు.



ఖరీఫ్‌కు భూమి సిద్ధం చేస్తున్న రైతు



అకాల వర్షాలకు మొలకలు వచ్చిన వరి ధాన్యం (ఫైల్)

అయోమయంలో అన్నదాత

» సాగుకు సిద్ధం కావాలా » తడిసిన ధాన్యం అమ్ముకోవాలా?
» రైతు భరోసా ముందే జమ చేయాలని రైతుల వినతి

ఆర్మూర్ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో రైతులు అయోమయంలో ఉన్నారు. పంటల సాగు కాలం ముందుకు వచ్చింది. ఇంతవరకు సన్నద్ధం అయింది లేదు. గత సంవత్సరం ఇప్పటికే పసుపు విత్తనం పెట్టేవారు. బోరు బావుల్లో నీరు ఉన్న రైతులు మొక్కజొన్న ముందుగా సాగు చేసేవారు. ఈ సం వత్సరం రెండో వారంలో అడపా దడప, మూడో వారంలో అకాల వర్షాలు కురిసాయి. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లోకి నల్లమట్టి, పశువుల పేడ తరలించేందుకు బిజీగా ఉన్న రైతులకు నల్లమట్టి తరలించకుండా అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో చాలా మంది రైతులు తమ భూముల్లోకి నల్లమట్టి, పశువుల పేడా ను తరలించడానికి అవకాశం లభించడం లేదు. అనంతరం అకాల వర్షాలు ఐదురోజుల పాటు కురియడంతో కల్లాలలో, రోడ్లపై ఉన్న వరి ధాన్యం తడిసి పోయి మొలకలు వచ్చి చేతి కిరాకుండ పోయాయి. పంటలు కొనుగోలు కేంద్రాలకు తర లిస్తే పెట్టుబడులకు డబ్బులు వస్తాయని ఆశించిన రైతులకు అకాల వర్షాలు నష్టాలనే మిగిల్చింది.

రైతుకు లేని భరోసా

గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అదనంగా ఎకరాకు రూ.2500 రూపాయలు ఇచ్చి ఏడు వేల ఐదువందలు ఇస్తామని ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించగా రైతులు ఆశపడ్డారు. తీర ప్రభుత్వం నిధులు లేవన్న సాకుతో ఎకరానికి ఆరు వేల రూపాయలే ఇస్తామని చెప్పడం అది నాలుగు ఎకరాల వరకే జమచేయడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

పెట్టుబడి కాలం రైతుకు కష్టకాలం..

జూన్ మాసం ప్రారంభం అయిందంటే వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి ధాన్యం, సజ్జపంట మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టాలకు గురయ్యారు. ప్రస్తుతం పంటల సాగుకు చేతులో డబ్బులు లేక పోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు, ట్రాక్టర్ ఖర్చులు ఇతర వ్యవసాయ కూలీల ఖర్చులు మొత్తం కలిపి ఎకరాన సుమారు రూ.25 వేలు, పసుపు సాగుకు ఎకరాన సుమారు రూ.70వేలు రైతుకు అవసరం ఉంటుంది. పూర్తి స్థాయిలో రుణమాఫీ జరుగక బ్యాంకులు పంట రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ప్రైయివేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకువచ్చిన రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదు కోవ డానికి ఖరీఫ్‌లో ముందుగానే పెట్టుబడి సాయం అందజేయాలి. ప్రభుత్వం అందజేసే రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో ముందుగానే జమ చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

చెరువు కట్టలు భద్రమేనా?

● జిల్లాలో మరమ్మతులకు నోచుకోని చెరువు కట్టలు ● భారీ వరదలకు గండ్లు పడుతున్న వైనం
● చెరువులపై ఇరిగేషన్ శాఖ దృష్టి సారించాలంటున్న గ్రామస్థులు



నర్వ చెరువు షట్టరును పూడ్చుతున్న గ్రామస్థులు

పెద్దకొడప్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ముగిసింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ సారి వానలు ముందస్తుగా కురుస్తున్నాయి. గత కొద్ది రోజుల కిందట వరకు నీరు లేక వెల వెలాడిన చెరువులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చిన్న చిన్న గుంతలలోకి నీరు చేరింది. ఇలా చేరిన నీటితో భూమి చిత్తడిగా మారింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే చెరువుల పై భాగంలో కురిసిన వాననీరంతా చెరవులలోకి చేరుతుంది. దీంతో చెరువులు నిండు కుండలా మారనున్నాయి. ఇంక భారీ వర్షాలు పడితే చెరువులకు గండ్లుపడటం ఖాయమంటున్నారు ఆయా గ్రామాల్లోని చెరువు ఆయకట్టు కిందనున్న రైతులు. గతంలో కూడ భారీ వర్షాలు కురిసిన సమయంలో చెరవులకు గండ్ల పడి నీరంతా వృథాగా పోయింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలతో పాటు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గత ఏడాది లాంటి ఘటనలు పునరావృతం అయ్యేనా

గత సంవత్సరం ఆశించిన స్థాయిలో వానలు కురియనప్పటికి చాలా చెరు వు లలోకి నీరు చేరలేదు. కొన్ని చెరు వులు, కుంటలు మాత్రం పూర్తి స్థాయి లో నీటితో నిండిపోయాయి. పెద్దకొడప్ గల్ మండలంలోని వడ్లం చెరువుకు భారీగా వరద నీరు రావడంతో తూంకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గండీకొట్టడంతో చెరువులోని నీరంతా వృథాగా వెళ్లి పోయింది. దీంతో గ్రామస్థులు స్థానికులకు సమాచారం అందించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు వచ్చి తూంకు మరమ్మతులు చేయించి నీటి ప్రవాహాన్ని ఆపివేశారు. ఇక మహమ్మద్ నగర్ మండలంలోని సింగీతం రిజర్వాయర్ రిటర్నింగ్ వాల్‌కు గండిపడటంతో నీరంతా దిగువకు వృథాగా పోయింది. దీంతో ఈ విషయాన్ని స్థానికులు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావ్ దృష్టికి తీసుక రావడంతో ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ శాఖ అధికారులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపాదికన మరమ్మ తులు చేయించారు. దీంతో నీరు ప్రవాహం వెళ్లకుండా అరికట్టారు. కొన్నేళ్ల కిందట పెద్ద కొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి చెరువు మధ్య భాగంలో గండిపడటంతో చెరువుకట్ట తెగిపోయే స్థితికి చేరింది. దీంతో ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసు కరావడంతో యుద్ధ ప్రాతిపాదికన మర మ్మతులు చేయించారు. దీంతో చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం నుంచి బయటపడింది. ప్రస్తుతం ఈ చెరవు కట్టపై ఇప్పటికి కట్ట కుంగిన ఆనవాళ్లు కనబడుతాయి.

నర్వ పాత చెరువు

తూం గండిని పూడ్చుకున్న ఆయకట్టు రైతన్నలు

ఇటీవల కురిసిన వర్షాలకు నర్వపాత చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అయితే చెరువుకు గల తూంకు షట్టర్లు లేక పోవడంతో వచ్చిన నీరంతా పంట పొలాల మీదుగా వృథాగా పోతుందని గమనించిన ఆయకట్టు రైతన్నలు ఎవరికో చెప్తే వారు వచ్చి మరమ్మతులు చేయడానికి సమయం పడుతుందని భావించి ఆయకట్టు రైతన్నలు ఏకమై తూం గండిని ఇసుక బస్తాలతో పూడ్చి వేశారు. ప్రస్తుతానికి నీరు వృథా అరికట్టినా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే ఈ సమస్య పునరావృతం అవుతుందని, తూంకు షట్టర్లు బిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇలా చెప్పు కుంటూ పోతే ఇంక వెలుగులోకి రాని చెరువులెన్నో ఉండచ్చు. రానున్నది వానాకాలం భా రీ వర్షాల కారణంగా చెరువులు నిండితే చెరువు కట్టలకు గండ్ల పడకుండ ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల అయకట్టు రైతన్నలు కోరుకుంటున్నారు.



గతంలో మరమ్మతులకు గురైన కాటేపల్లి చెరువు కట్ట



తూము షట్టర్‌కు ఇసుక సంచులతో పూడ్చిన దృశ్యం

ఇరిగేషన్ ఈఈ ఏమంటున్నారంటే..

ఈ విషయం గురించి ఇరిగేషన్ ఈఈ సోలోమన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, తమకు చెరువు కట్టలు బాగా లేవని ఏ మండలం నుంచి రైతులు గాని తమ శాఖ అధికారులు గాని దృష్టికి తీసుకరాలేదని తెలిపారు. అందుకే చెరువు కట్టల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపలేదని, వానలకు చెరువులు నిండి ఏదైనా చెరువుకు గండి పడితే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. నియోజక వర్గంలో ఉన్న చెరువులపై తమ శాఖకు చెందిన లష్కర్ల పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

సాగు కోసం రైతన్న సమాయత్తం

» సన్న వరి సాగా.. దొడ్డు వరి సాగా?! అన్న డైలామాలో రైతులు
» సన్నాల బోనస్ కోసం ఎదురు చూపులు



వరి సాగు దృశ్యం

పెద్ద కొడప్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ముగిసింది. రబీ సీజన్‌లో రైతులు తాము పంట చేల్లో పండించిన పంటలను అమ్ముకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలోనే వర్షాలు ముందస్తుగా కురుస్తున్నాయి. దీంతో భూమిని నమ్ముకుని ఉండే రైతన్నలు యథాతథంగా ఖరీఫ్ పంట సాగు కోసం సన్నద్ధమవుతున్నారు. గతంలో అయితే జూన్ నెలలో మృగశిర కార్తె ప్రారంభం అయిన తర్వాత చేలను దున్ని పంట సాగు చేసేవారు. అయితే మారిన పరిస్థితుల దృష్ట్యా ఇప్పటి నుంచే పంట సాగుకు సిద్ధమవుతున్నారు రైతన్నలు. జుక్కల్ నియోజక వర్గంలో నిజాంసాగర్ మండలం తో పాటు పిట్లం మండలంలోని కొన్ని గ్రామాలు కమాండ్ ఏరియాలోకి రాగా మినహా మిగతా మండలాలు నాన్ కమాండ్ ఏరియాలోకి వస్తాయి. పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లి మండలాలలో అధికంగా నల్ల రేగడి భూములు ఉన్నందున ఈ ప్రాంత రైతన్నలు ఆరుతడి పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఇదే మండలాలలోని బోరు బావులు ఉన్న రైతులతో పాటు బిచ్కుంద, డోంగ్లి, పిట్లం మండలాల మంజీరా పరివాహక ప్రాంత రైతులు వరి పంట సాగుపై ఆసక్తి చూపుతారు. దీంతో ఈ ప్రాంత రైతులు కొన్నేళ్లుగా దొడ్డు రకం వరిని సాగు చేస్తున్నారు.

అయోమయంలో రైతులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా సన్నాలకు క్వింటాలుకు 5 వందల రూపాయల బోనస్ ఇస్తా మని ప్రకటించింది. గత ఖరీఫ్ సీజన్‌లో మాటిచ్చిన విధంగా సన్నాలు సాగు చేసిన రైతన్నలకు బోనస్ అందజేసింది. దీంతో రబీ సీజన్‌లో కూడా రైతన్నలు బోనస్ వస్తుందని నమ్మకంతో సన్నాలను సాగు చేశారు. అయితే నేటి వరకు బోనస్ కొందరికే అందింది. మిగతా వారికి ఇంక బోనస్ అందకపోవడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో ఏ రకం వరిని సాగు చేయాలన్న సంశయంలో పడిపోయాడు రైతన్న. సన్న రకం సాగు చేస్తే దిగుబడి తక్కువ వస్తుందని బోనస్‌తో దానిని సరిపెట్టుకోవ చ్చని చూస్తున్నారు రైతన్నలు. ఇక దొడ్డు రకంను సాగు చేస్తే దిగుబడి బాగా వచ్చిన బోనస్ అందదేమే అని ఆలోచన చేస్తున్నారు రైతన్నలు. తాము ఏ రకం వరిని సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. సన్నరకానికి బోనస్ వస్తుందా లేదా ఆరా తీస్తున్నారు.

బోనస్ డబ్బుల కోసం రైతన్నల ఎదురుచూపులు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ, సహకార సంఘాల ద్వారా 3 లక్షల 77 వేల 716 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని అధికారులు తెలిపారు. ఇందులో 1 లక్ష 98 వేల 608 మెట్రిక్ టన్నుల దొడ్డు సరుకు కాగా, 1 లక్ష 79 వేల 108 మెట్రిక్ టన్నుల సన్న సరుకు ఉన్నట్లు సమాచారం. రైతుల దగ్గర కొనుగోలు చేసిన వరి ధాన్యం డబ్బులు రూ.931.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. సన్నాలకు సంబంధించి 87 కోట్ల బోనస్ డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమ చేశారు. అయితే మిగతా రైతులకు నేటి వరకు బోనస్ అందకపోవడంతో వాటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా వరి సాగుపై వ్యవసాయ శాఖ అధికారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రబీలో 50 ఎకరాల్లో వరి విత్తన సాగు

» మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో అకాల వర్షాలకు తడిసి, మొలకలొచ్చి ముక్కిపోయిన వరి సీడ్ ధాన్యం » ధాన్యం కల్లాలకు చేరుకున్నప్పటి నుంచి ఎడతెరిపి లేని అకాల వర్షం
» 60 శాతం తడిసి మొలక లొచ్చి, ముక్కిపోయిన వరి ధాన్యం » క్షేత్రంలో భారీగా నష్టం



అకాల వర్షానికి తడిసి మొలకలొచ్చి ముక్కిపోయిన వరి సీడ్ ధాన్యం



వర్షానికి తడిసి ముక్కిపోయిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా కూలీలు

నాగిరెడ్డిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రంలో ప్రస్తుత రబీలో సాగు చేసిన వరి సీడ్ ధాన్యం ఇటీవల వారం, పది రోజులుగా కురిసిన అకాల వర్షం కారణంగా తడిసి ముద్దయి వరి ధాన్యానికి మొలకలొచ్చి ముక్కిపోయింది. దీంతో క్షేత్రంలో తీవ్ర నష్టం వాటిల్లింది. రబీ సీజన్‌లో క్షేత్రంలో 50 ఎకరాలలో కేఎన్ఎం 1638 రకం వరి విత్తనాన్ని సాగు చేశారు. పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల అనంతరం కొంత ఆలస్యంగా పంటను క్షేత్రంలో అధి కారులు 15 రోజుల క్రితం వరి పంట కోతను ప్రారంభించారు. ఐదారు రోజుల పాటు పంట కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కల్లాలకు తరలిం చారు. కల్లాలకు ధాన్యం చేరుకున్నప్పటి నుంచి అకాల వర్షాలు కురవ డంతో, ధాన్యం తడవకుండా క్షేత్రం సిబ్బంది ధాన్యంపైన టార్పాలిన్‌లు కప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో చాలా వరకు వరి విత్తన ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యం రంగు మారి, మొలకలొచ్చి, ముక్కిపోయింది. క్షేత్రంలో 50 ఎకరాలలో పండించిన సీడ్ ధాన్యం సుమారు 60 శాతం వరకు తడిసి ముద్దై, మొలకలొచ్చి ముక్కిపోయింది. క్షేత్రంలో సాగు చేసిన 50 ఎకరాలలోని వరి విత్తన పంట చేతికొచ్చాక అకాల వర్షం కారణంగా 60 శాతం వరకు విత్తన వరి ధాన్యం వర్షానికి తడవడం కారణంగా ధాన్యం చెడిపోవడంతో క్షేత్రానికి తీరని నష్టం వాటిల్లింది. ఈ క్షేత్రంలో ఉత్పత్తి చేసిన వరి విత్తనాలను తెలంగాణ రాష్ట్ర సీడ్‌కు పంపించాల్సి ఉండగా ప్రస్తుతం క్షేత్రంలో సాగు చేసిన వరి విత్తనం సీడ్ వర్షాలకు తడిసిపోయి చెడిపోవడంతో ఈ ధాన్యం సీడ్‌కోసం పనికి రాదని రాష్ట్ర సీడ్ అధికారులు దీనిని తీసుకోవడానికి నిరాకరించినట్లు క్షేత్రం సిబ్బంది తెలిపారు. దీంతో నాన్ సీడ్ కింద ఈ ధాన్యాన్ని విక్రయించే ఆలోచనలో క్షేత్రం సిబ్బంది ఉన్నారు.

● తడిసిన ధాన్యం ఆరబెట్టే పనుల్లో నిమగ్నం

అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని, మొలకలు వచ్చి ము క్కిపోయిన ధాన్యాన్ని క్షేత్రం అధికారులు ప్రస్తుతం ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం వాతావరణం అనుకూలించడంతో ఉదయం నుంచి కూలీల చేత ధాన్యాన్ని ఆర బెడుతూ గోదాంలో నిల్వ ఉంచుతున్నారు. తడిసిన ధాన్యాన్ని, ముక్కి పోయిన ధాన్యాన్ని ఎండకు ఆర బెడుతున్నారు.

● ధాన్యం తడిసిపోవడంతో క్షేత్రానికి భారీ నష్టం

క్షేత్రంలో 50 ఎకరాలలో సాగు చేసిన మేలు రకమైన వరి సీడ ధాన్యం సుమారు 60 శాతం వరకు తడిసి ముద్దై, మొలకలొచ్చి ముక్కి పోయింది. అకాల వర్షం కారణంగా 60 శాతం వరకు వరి విత్తన ధాన్యం వర్షానికి తడవడం కారణంగా ధాన్యం చెడిపోవడంతో క్షేత్రానికి తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి క్షేత్రం లో 50 ఎకరాలలో వరి విత్తన పంటను సాగు చేశారు. పంట మొత్తం చేతికి వచ్చాక, వరి ధాన్యం కల్లాలకు చేరుకున్నాక అకాల వర్షానికి ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లింది.



తడిసి ముక్కిపోయిన వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

బాన్సువాడ బస్టాండ్‌లో సమస్యల తిష్ఠ

» పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు » పరిసరాల్లో చెత్త » కానరాని అధికారుల చర్యలు

బాన్సువాడ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణప్రాంగణం అంటే ప్రజలు తమ ప్రయాణాలను మొదలు పెట్టడానికి లేదా ముగించడానికి ఉపయోగపడే రవాణా కేంద్రం. ఇక్కడ ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. కానీ బాన్సువాడ ప్రయాణ ప్రాంగణం అందుకు భిన్నంగా మారింది. అరకొర వసతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకుల సమస్యలను పరిష్కరించే అధికారులు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు

పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు..

బాన్సువాడ బస్టాండ్‌కు 1985 ఆగష్టు 9న శంకుస్థాపన జరిగింది. కాగా 1988, మే 5న అప్పటి ఎమ్మెల్యే ఎస్‌విఎల్ నరసింహారావు ప్రారంభించారు. బస్టాండ్ నిర్మాణం చేపట్టి దాదాపుగా 37 సంవత్సరాలు దాటింది. నాటి నుంచి నేటి వరకు అడపాదడపా ఆర్టీసీ బస్టాండ్‌కు మరమ్మత్తులు మాత్రమే చేపట్టారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బస్టాండ్ పైకప్పు పెచ్చులూడుతూ దర్శనమిస్తోంది. రాబోయే వర్షాకాంలో మరింత పెచ్చులూడే అవకాశాలున్నాయి. అధికారులు బహుశా ఆ వైపుకు కనీసం కన్నెత్తైనా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

బాన్సువాడ బస్టాండ్‌లో రద్దీ ..

బాన్సువాడ మున్సిపాలిటీగా మారిన తర్వాత రద్దీ బాగా పెరిగిపోయింది. ప్రతీ నిత్యం చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రయాణీకులు వివిధ పనుల నిమిత్తం బాన్సువాడకు విచ్చేసి పనులు చక్కదిద్దుకుంటుంటారు. పనులు ముగించుకుని బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షణ చేయాలంటే స్థలం కూడా సరిపడా లేకుండాపోయింది. చాలా మంది ప్రయాణికులు బస్సుల కోసం ఆరుబయటే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు బాన్సువాడ బస్టాండ్‌లో కేవలం నాలుగు ప్లాట్‌ఫాంలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత ఖాళీ స్థలంలో నిర్మాణం చేపట్టడంతో ప్లాట్‌ఫాంల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పడంలేదు.



బాన్సువాడ బస్టాండ్ ఇదే

పరిసరాల్లో చెత్తా, చెదారం

బాన్సువాడ బస్టాండ్ పరిసరాలు చెత్తా ,చెదారాలతో దర్శనమిస్తున్నాయి. ఎప్పటికపుడు శుభ్రం చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. తాగేనీరు స్థలం శుభ్రంగా లేపోవడంతో ప్రయాణీకులు నీరు తాగాలంటేనే జంకుతున్నారు. ఇదిలా ఉండగా బస్టాండ్‌లో ప్రయాణీకులు కూర్చోవడానికి కుర్చీలు కూడా కరువయ్యాయి. అధికారులు చొరవచూపి బాన్సువాడ బస్టాండ్‌లో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారుల బాధ్యతల స్వీకరణ

బిచ్కుంద, మే 30(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మున్సిపల్ కమిషనర్‌గా ఖయ్యూం, మున్సిపల్ ప్రత్యేకాధికారిగా నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిట్ నోట్ విడుదల చేసినందున మున్సిపల్ పరిధిలో ఉన్న గోపన్‌పల్లి, కందర్‌పల్లి, దౌల్తాపూర్, బిచ్కుంద గ్రామ పంచాయతీ రికార్డులన్నీ సీజ్ చేసి పెట్టాలని తెలిపారు. మున్సిపాలిటీ ఉత్తర్వులు జారీ అయిన తర్వాత పంచాయతీ పరంగా ఎలాంటి బిల్లులు చెల్లించరాదని ఇళ్ల నిర్మాణాల అనుమతులు కూడా ఇవ్వకూడదని ఇచ్చినా చెల్లుబాటు కాదన్నారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులను పంచాయతీ సిబ్బంది తదితరులు సన్మానించారు.


భిక్కనూరులో విత్తనాల దుకాణంలో తనిఖీ చేపడుతున్న దృశ్యం

విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదు ఇవ్వాలి

● ఏడీఏ అపర్ణ

భిక్కనూరు మే 30(ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదును ఇవ్వాలని ఏడీఏ అపర్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు అన్ని స్టాక్ రిజిస్టర్‌లో, సూచిక బోర్డుపై ఎప్పటికప్పుడు నమోదు చేసి ఉంచాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల రశీదులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, ఎస్సై దత్తాద్రిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

జుక్కల్ మండలానికి రేషన్ బియ్యం సరఫరా

జుక్కల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గల 24 చౌకధరల దుకాణాలకు 857 టన్నుల మూడు నెలలకు సరిపోవు బియ్యం లారీల్లో సరఫరా చేశామని ఆర్ఐ రామారావు తెలిపారు. రేషన్ బియ్యం కార్డు కలిగిన వారు రేషన్‌డీలర్ల వద్ద నుంచి మూడు నెలల బియ్యం పొందాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గోదాంలో బియ్యం నిల్వలు అధికంగా ఉండడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మూన్నేళ్ల బియ్యంను ఒకేసారి తీసుకెళ్లాలని ఆయన అన్నారు.

తడుగూర్‌లో కంటి వైద్య శిబిరం

మద్నూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్ద తడుగూర్ గ్రామంలో శుక్రవారం లయన్స్ క్లబ్ బోధన్ వారి ఆధ్వర్యంలో కంటి పరీక్షల క్యాంపు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 18 మందికి మోతిబిందు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వారిని బోధన్ లయన్స్ క్లబ్ ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు క్యాంప్ ఇన్‌చార్జి హనుమంతరావు పటేల్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు శానిటరి ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ

నిజాంసాగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆరేడు గ్రామంలో శుక్రవారం జల్ జీవన్ ఉమెన్ ఎంపర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో యూనిచామ్ ఏఆర్ఎస్ సహకారంతో రుతు పరిశుభ్రత దినోత్సవం వేడుకలు స్థానిక లయన్స్ క్లబ్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుతుస్రావం ప్రాముఖ్యత, పాటించాల్సిన సూచనలు, సలహాలు, జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవికుమార్, జిల్లా సంఘం క్యాషియర్ కృష్ణవేణి, సమన్వయ కార్యకర్తలు అంజమ్మ, వెంకటలక్ష్మీ, యశోద, ఎస్. స్వప్న, ఆరేడు గ్రామంలో 50 మంది మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.


గోకుల్ తండాలో పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న దృశ్యం

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

రామారెడ్డి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకుల్‌తండా గ్రామంలో శుక్రవారం తల్లిదండ్రులు, టీచర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. ముందస్తు బడిబాటలో భాగంగా 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ఒకటవ తరగతిలో చేర్పించాలని పిల్లల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, శ్రీనివాస్, అబ్దుల్ ఖదీర్, సీఆర్పీ మహమూద్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


మెంగారంలో పెద్దమ్మకు బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

మెంగారంలో పెద్దమ్మకు బోనాలు

లింగంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెంగారంలో శుక్రవారం పెద్దమ్మకు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో బోనాలతో శోభాయాత్రగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మంచి వర్షాలు కురిసి, గ్రామంలో పాడి పంటలతో వర్ధిల్లాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

రామారెడ్డి: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో శుక్రవారం మహిళలు వైభవంగా పోచమ్మ బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊరడ మ్మా పండగ వేడుకలు మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రాజనర్సు, మాజీ ఉప సర్పంచ్, వీడీసీ కమిటీ సభ్యులు పన్యాల అంజల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్ రావు, కర్రోళ్ల లింగం, బోయ లింగం, అశోక్, మధు, లక్ష్మీనారాయణ, మహిళ లు అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి


బస్వాపూర్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించి పలువురికి ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇళ్లను కొల తల ప్రకారం నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్ర మంలో గ్రామ పంచాయ తీ కార్యదర్శి దయాకర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తు డుం జీవన్, గ్రామశాఖ అధ్యక్షుడు సిద్దరాములు, నాయకులు ఎల్లం, బాబు, లోకేష్, చందు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

బాన్సువాడ టౌన్ : బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటికి పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు గ్రామస్థులు సతీష్‌రెడ్డి తదితరులున్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికా రులు ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలో లబ్ధిదారు గంగవ్వ ఇంటి నిర్మాణ స్థలాన్ని పరిశీలిం చిన మండల ప్రత్యేక అధి కారి భాస్కర్, ఎంపీడీవో ఏలేట తిరుపతిరెడ్డి ముగ్గు లు పోసి ఇంటి నిర్మాణం పనులు సక్రమంగా నిర్వహి ంచాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్య దర్శి క్రాంతి కుమార్, రామారెడ్డి మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ నామాల రవి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్ : మండలంలోని దామరంచ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, సొసైటీ వైస్ చైర్మన్ గంగారం, మాజీ వైస్ ఎంపీపీ కాశీరాం పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్ : పేద ప్రజలకు ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందజేశారు.


బోర్లంలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

కల్వరాల్ ఉన్నత పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి

(3వ పేజీ తరువాయి)

అవసరమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన నాణ్యత గల ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, యువజన సంఘాలు పాఠశాలలపై, పాఠశాల బాగోగులపై దృష్టిసారిస్తే ఉత్తమ ఫలితాలు వాటింతట అవే వస్తాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరలగతులను, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను పరిశీలించి అభినందించారు. అన్నిపాఠశాలలు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పాఠశాలకు ఇలాంటి వసతులు అందజేయడానికి ప్రతిఒక్కరు ముందుకు వస్తే ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులు చదువుకుంటారని అన్నారు. ఒక దశలో మూసివేయాలన్న ఆలోచన ఉన్న సందర్భంలో పాఠశాల హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి చేసిన కృషివల్లనే విద్యార్థుల సంఖ్య 7 నుంచి 56కు పెంచు కోవడం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న హెచ్‌ఎంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు, ఏఎంవో వణుగోపాల్ శర్మ, కల్వరాల్ విడీసీ చైర్మన్ కుంట రాజారెడ్డి, స్థానిక యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

బాన్సువాడటౌన్ , మే 30 (ఆంధ్రజ్యోతి) : రైతాంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచాడని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి , కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరలున్నారు.

లింగంపేట : రైతులకు మోడీ ప్రభుత్వం మద్దతు ధరను పెంచి అండగా నిలిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అన్నారు. ఈసంర్బంగా బీజేపీ నాయకులు శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరాస్తాలో మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు బొల్లారం క్రాంతి, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, నాయకులు మురళి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాంలు, నవీన్, ప్రభాకర్‌రావు, సంతోష్‌రెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

కామారెడ్డిటౌన్ : అన్నదాతలకు ప్రధాని నరేంద్రమోదీ అండగా నిలుస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు ప్రధాని మోదీ 14 పంటలకు కనీసమద్దతు ప్రకటిం చారని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రవీందర్‌రావు, కిసాన్‌మోర్చా నాయకులు గంగారెడ్డి, ఆనందరావు, లింగారావు, రాజు,జైపా ల్‌రెడ్డి, నరసింహరెడ్డి, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు నిధుల మంజూరు

మద్నూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నిర్మించే రోడ్లకు సీఆర్‌ఆర్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు అయినట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తెలిపారు. మద్నూర్ మండలంలో రాచూర్ గ్రామానికి జాతీయ రహదారి 161 నుంచి 2.7 కిలో మీటర్ల రోడ్డుకు ఎమ్మెల్యే ఇటీవల శంకుస్థాపన చేశారు. అదే విధంగా డోంగ్లి మండలం జిల్లా పరిషత్ రోడ్డు నుంచి మదన్ హిప్పర్గా టు ఇల్లేగావ్ 1.80 కిలో మీటర్ రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు, బిచ్కుంద మండలం పిడబ్ల్యూడీ రోడ్డు నుంచి మెక్కా వరకు 1.50 కిలో మీటర్లకు రూ.1.50 కోట్లు, జుక్కల్ మండలంలో అప్రోచ్ రోడ్డు నుంచి భవాని తండా వరకు ఒక కిలో మీటర్‌కు రూ. 1.20 కోట్లు పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పెద్దఎడ్గి తండా వరకు రూ.72 లక్షలు, పెద్ద కొడప్గల్ మండలం బాబుల్ గావ్ జిల్లా పరిషత్ రోడ్డు నుంచి చింతల్ వాడి రోడ్డు వరకు రెండు కిలో మీటర్లకు గాను రూ.2.40, గుండూర్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ఒక కిలో మీటర్‌కు రూ. 1.20 కోట్లు, పిట్లం మండలం కలహేర్ నుంచి సంగారెడ్డి, జిల్లా సరిహద్దు వరకు 2.70 కిలో మీటర్‌కు రూ.2.78 కోట్లు మంజూరైనట్లు పంచాయితీ రాజ్ ఏఈ అరుణ్ వెల్లడించారు.

సమ్మర్ క్యాంపుతో విద్యార్థులకు మేలు

లింగంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపుతో విద్యార్థులకు మేలు జరిగిందని క్యాంపు ఇన్‌చార్జీ వాహీద్ సిద్దీఖీ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు యూసూఫ్; రాజులు, సాయిరాం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొల్కంపేటలో గ్రామ దేవతల జాతర

లింగంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొల్కంపేటలో శుక్రవారం గ్రామ దేవతలకు జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నాయికమ్మ, అక్కమ్మలకు ఎడ్లబండ్ల ప్రదర్శనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అటవీ భూములను..

(3వ పేజీ తరువాయి)

బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆర్గొండ అడవుల్లో ప్రపంచ పర్యవరణ దినోత్సవం

రాజంపేట మండలంలోని ఆర్గొండ అటవీప్రాంతంలో శుక్రవారం అటవీశాఖాధికారులు ప్రపంచ పర్యావరణ దినోత్సవంను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ రామకృష్ణ మాట్లాడుతూ వారోత్సవాలు అటవీప్రాంతంలో చెత్తప్లాస్టిక్‌ను సేకరించినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని,ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని ప్లాస్టిక్‌పై వచ్చే నష్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ రమేష్, శ్రీధర్,సయ్యద్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ సేవలు అందించాలి

● జిల్లా వైద్య అధికారి చంద్రశేఖర్


పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారి చంద్రశేఖర్

బీర్కూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య అధికారి చంద్ర శేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన బీర్కూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆసుపత్రిలోని గదులను, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వర్షం కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ గిరీష్, సిహెచ్‌ఓ రవీందర్, స్టాఫ్ నర్సు మహ్మది, సూపర్ వైజర్ నరసమ్మ, ఫార్మసిస్ట్ సంతోష్, ఆయుష్ ఫార్మసిస్ట్ మౌనిక, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న షబ్బీర్‌అలీ

దోమకొండ, మే 30(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన రాఘవపల్లి సిద్దగౌడ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, అబ్రబోయిన స్వామి, రామస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలను సరైన తేమశాతంలో నాటుకోవాలి

సదాశివనగర్, మే 30(ఆంధ్రజ్యోతి): జీలుగ విత్తనాలను రైతులు సరైనా తేమశాతం గుర్తించి నాటుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తునూరు, పద్మాజీవాడి, సదాశివనగర్ సహకార సంఘాల్లో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 500ల బస్తాల జీలుగ విత్తనాలు రావడం జరిగిందని, రైతుల అవసరాలను బట్టీ మరికొన్ని అందించే అవకాశం ఉందని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘాల చైర్మన్లు సదాశివరెడ్డి, గంగాధర్, ప్రభాకర్‌రావు, కమలాకర్‌రావు, సీఈవోలు భైరయ్య, దేవేంద్రరావు, నయామ్, విగ్నేష్ గౌడ్, వ్యవసాయ విస్తీర్ణ అధకారులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో భాగా ధరలు పెంచి నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టారని మండలంలోని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జీలుగ బస్తాలను కొనుగోలు చేసిన రైతులు ఇంటి వద్దకు వెళ్లి బ్యాగును తెరిచి చూడగా 50శాతం పుచ్చిపోయిన విత్తనాలు కనబడటంతో అవాక్కయ్యామని అన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాల సమర్పణ

పెద్ద కొడప్‌గల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో శుక్రవారం ముత్యాల పోచమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లకు గ్రామ మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం మృగశిర కార్తెకు ముందు ఈ పండుగను నిర్వహిస్తారు. వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

పైరవీలకే పెద్దపీట..

(3వ పేజీ తరువాయి)

అంతేకా కుండా ఇంటి నిర్మాణం 600 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించకూడదనే నిబంధనకు తోడు పెరిగిన సిమెంట్, స్టీల్, కూలీల ధరలు కూడా లబ్ధిదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏప్రిల్ నెలాఖరు వరకు సిమెంట్ బస్తా రూ.290 నుంచి రూ.300ల వరకు ఉండగా ప్రస్తుతం ఒక్కో బస్తా ధర రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగింది. పెరిగిన ధరల భారంగా మారడంతో మెజార్టీ లబ్ధిదారులు పిల్లర్ గుంతలు, బేస్మిట్ దశలోనే నిర్మాణాలను నిలిపివేయడం గమనార్హం. ఇదిలా ఉంటే కొంతమంది మధ్యవర్తులు కొత్త ఇళ్లు కట్టుకోవాలని భావించే ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని సాధారణ మధ్య తరగతి ప్రజలకు ఇళ్లు మంజూరు చేయిస్తామని ఆశచూపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆలయాల అభివృద్ధికి తోడ్పడాలి

(3వ పేజీ తరువాయి)

వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎంతోకొంత ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. పేదలకు సహాయంగా, నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటానని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల, కొత్త రేషన్‌కార్డులు అర్హులకు మాత్రమే అందిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ చేసి చూపించామని, రైతు భరోసా అందిస్తున్నామని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతి, యువకులు ఉపాధి పొందవచ్చని తెలిపారు. భూ భారతి ద్వారా రైతుల సమస్యలు శాశ్వతంగా తొలగిపోతాయని తెలిపారు.

రాజకీయ వ్యవహారాల కమిటీకి ఎంపికైన షబ్బీర్‌అలీ

దోమకొండ: తెలంగాణ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీని 22 మంది సభ్యులతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేసినట్లు దోమకొండ మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ తెలిపారు. కమిటీలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను చేర్చడంపై కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీనిని పురస్కరించుకుని దోమకొండ మండల మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ శుక్రవారం కామారెడ్డి జిల్లా కార్యాలయంలో షబ్బీర్‌అలీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మామిండ్ల లక్ష్మీ, అంజయ్య, బల్యాల సుదర్శన్, దోమకొండ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి. పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలో చోటు కల్పించడం సంతోషకరం

కామారెడ్డి టౌన్ : పదవి ఉన్నా.. లేకున్నా ప్రజల కోసం పాటుపడే ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఏఐసీసీ పొలిటికల్ ఎఫైర్స్‌ల కమిటీలో చోటు కల్పించడం సంతోషించదగిన విషయమని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటూ ప్రతీ కార్యకర్తకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ అటు పార్టీని ఇటు ప్రజలకు ఆయన చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. కమిటీలో చోటు దక్కేలా కృషి చేసిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లకు కాంగ్రెస్ జిల్లా మహిళా విభాగం నుంచి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.


షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న దోమకొండ కాంగ్రెస్ నాయకులు

పిట్లంలో నాలుగు ఇళ్లల్లో చోరీ

పిట్లం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్ కాలనీలో గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయం చూసిన కాలనీవాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల వద్ద వివరాలు సేకరించారు. క్లూస్‌టీం బృందం వేలి ముద్రలను సేకరించారు. పోలీసులు వివరాల కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

డోంగ్లీలో యోగా తరగతులు ప్రారంభం

మద్నూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లీ మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం నుంచి యోగా తరగతులు ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని యోగా శిక్షకులను నియమించింది. ప్రతిరోజూ గంట పాటు ఆసుపత్రిలో రోగులకు యోగాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, యోగా శిక్షకులు జ్యాత్రి సుప్రియ వెల్లడించారు. మనిషి తన జీవితంలో ఏ కార్యాన్ని ఆచరించాలన్నా తనకున్న గమ్యాన్ని చేరుకోవాలన్నారు. దానికి ప్రధానమైన శరీరం లేకపోతే ఇవేమి జరగవన్నారు. శరీరం ఆరోగ్యవంతమైనదిగా ఉండాలని అప్పుడే ఇవన్నీ సాధ్యమవుతాయని, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రధాన మార్గం యోగా అభ్యాసమని తెలిపారు. శరీరానికి నిత్యం వ్యాయామం ఉన్నట్లయితే రోగాలు దరి చేరవని సూచించారు. ప్రతి రోజూ డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గంట పాటు యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సూచించారు. ఈ శిక్షణ ఆసుపత్రి ఆవరణలోనే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సందీప్ జాదవ్, డాక్టర్ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.


యోగా తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - వర్షం
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి భైరవం
వెంకటేశ్వర - నిశ్శబ్ద ప్రేమ



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

